క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మోత్కూరు: యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా కార్యదర్శి మోత్కూరుకు చెందిన కారుపోతుల వెంకన్న గౌడ్ తండ్రి యాకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు. ఆయన పంపిన రూ.లక్ష నగదును డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి వారికి అందజేశారు. ఆయన వెంట ప్రముఖ పారిశ్రామికవేత్త ఎగమాటి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ సమీర్ తదితరులున్నారు.

అండర్‌పాస్ నిర్మించాలి



వినతిపత్రం అందజేస్తున్న అండర్ పాస్ నిర్మాణ సాధన కమిటీ సభ్యులు

భువనగిరి: పట్టణ శివారులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ అండర్ పాస్ నిర్మాణ సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, కమిటీ కన్వీనర్ సిల్వేరు ఎల్లయ్య మాట్లాడారు. అండర్ పాస్ నిర్మాణం లేక ఇప్పి వరకు 14 మంది మృత్యువాత పడటంతో పాటు 80 మందికి గాయాలయ్యాయన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో రామకృష్ణపురం, పెంచికల్‌పహడ్ గ్రామస్తులు ఉన్నారు.

రూ.9 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేత



నగదు అందజేస్తున్న కాలనీవాసులు

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన ఆకారపు మధు (బాషా) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాలనీకి చెందిన వాట్సాప్ గ్రూపు సభ్యులు బాధిత కుటుంబానికి శుక్రవారం రూ.9 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కాంబోజు మహేందర్, మోత్కూరు రమేష్, జిట్ట నరేష్, వేణు, బొడిగె శ్రీహరి, ప్రవీణ్ తదితరులున్నారు.


ఆర్థిక సాయం అందజేత

వలిగొండ : మండలంలోని టేకులసోమారానికి నారగోని సైదులు ఇటీవల రైలు ప్రమాదంలో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి అదే గ్రామానికి చెందిన పీఎస్ఆర్ ఫౌండేషన్ అధినేత పనుమటి నరేందర్ రెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన రూ.10 వేల ఆర్థికసాయాన్ని ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం అందజేశారు.

రమాబాయికి నివాళి

రామన్నపేట: రమాబాయి అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం రామన్నపేట మండలంలోని కక్కిరేణిలో గ్రామస్తులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వేముల సైదులు, కన్నెబోయిన జగన్, యాదయ్య, దయాకర్, ప్రసాద్, లక్ష్మణ్, నర్సింహ, నరేష్, విష్ణు, సత్తయ్య, సుశీల, యశోద పాల్గొన్నారు.

శాలివాహనుల నిరసన



నిరసన తెలుపుతున్న శాలివాహనులు

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో మంజూరైన శాలివాహన సంఘ భవనాన్ని నిర్మించకపోవడం పట్ల శుక్రవారం భవన శిలాఫలకం వద్ద శాలివాహనులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో భవన నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ రూ.5 లక్షలు మంజూరు చేయించారన్నారు. ఇద్దరు మాజీ ప్రజాప్రతినిధులు భవన నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం మండల అధ్యక్షుడు నిలిగొండ అంజయ్య, నిలిగొండ సత్తయ్య, నిలిగొండ భిక్షపతి, నిలిగొండ అశోక్ తదితరులున్నారు.

సాగు నీటి సాధనకు కలిసికట్టుగా పోరాడుదాం

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ ప్రాంతంలో సాగునీటి సాధనకు గ్రామాల్లోని ప్రజలందరూ కలిసికట్టుగా పోరాడాలని ఆందోళ్ మైసమ్మ జల సాధన సమితి నాయకుడు బూడిద జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలంలోని పీపల్‌పహాడ్ గ్రామంలో గ్రామస్తులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చౌటుప్పల్ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో రైతాంగానికి సాగునీరు లేకుండా పోయిందన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చీరిక రాణిరంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ వరకాంతం పెంటారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆటలు ఆడేదెట్లా!



దుప్పల్లిలో మైదానం లేక పాత గోడలకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు



నరసాపురంలో వృథాగా పడేసిన క్రీడా ప్రాంగణం బోర్డు

- నిరుపయోగంగా మారిన గ్రామీణ క్రీడాప్రాంగణాలు
- పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న మైదానాలు

వలిగొండ: గ్రామీణ ప్రాంతాల్లో యువతను క్రీడల వైపు మళ్లించి వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. అధికారులు కేటాయించిన స్థలాలు కొన్ని చోట్ల గ్రామాలకు దూరంగా ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో నిర్వహణ చూసే వారు లేక చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగాయి. మండల వ్యాప్తంగా ఉన్న 37 గ్రామ పంచాయతీల్లో వెంకటాపురం, మొగిలిపాక గ్రామాల్లో తప్ప 35 గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో రెండు సంవత్సరాల క్రితం వాటిని నిర్మించినా ఇప్పటి వరకు ఏ గ్రామంలోని ప్రాంగణాల్లో యువకులు క్రీడలు నిర్వహించిన దాఖలాలు లేవు. అప్పట్లో జిల్లా అధికారులు మండల స్థాయి అధికారులను ఒత్తిడి చేయడంతో తూతూ మంత్రంగా అందుబాటులో ఉన్న స్థలాలను ఎంపిక చేసి క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. కానీ ఇప్పటివరకు కొంత మంది సర్పంచులకు బిల్లులే అందలేదు. అంతేకాకుండా పలు గ్రామాల్లో అధికారులు క్రీడా ప్రాంగణాలను చదును చేసి వదిలివేశారు.

వసతులు కల్పిస్తాం



గ్రామీణ క్రీడా ప్రాంగణాలు వినియోగంలోకి వచ్చేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిస్తాం. నిధులు లేని గ్రామాల్లో ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం. క్రీడాసామగ్రి సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– జితేందర్ రెడ్డి, ఎంపీడీఓ, వలిగొండ

కనీస సౌకర్యాలు కల్పించాలి



గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో వసతులు కల్పించకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా క్రీడాకారులకు క్రీడాసామగ్రి సమకూర్చి క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తీసుకురావాలి.

– బుంగమట్ల కృష్ణ, క్రీడాకారుడు

క్రీడాసామగ్రి సమకూర్చాలి



గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. కానీ కనీస వసతులు ఏర్పాటు చేయలేదు. క్రీడాకారులకు క్రీడా సామగ్రి సమకూర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా క్రీడా ప్రాంగణాలను ఆధునీకరించాలి.

– ఎడవెల్లి రమేష్

మల్లాపురంలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలి



మల్లాపురం గ్రామంలో రిలే దీక్షలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానికంగా రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత సహకారంతో మల్లాపురం గ్రామంలో సర్వే నంబర్ 64లో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కళాశాల నిర్మాణం చేయకుండా వేరే ప్రాంతానికి తరలించే యోచనలో ఉన్నారన్నారు. మల్లాపురం గ్రామంలోనే వైద్య కళాశాల నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. రిలే దీక్షలను మాజీ జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, కర్రె కమలమ్మ ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రిలే దీక్షలు చేయొద్దని యాదగిరిగుట్ట పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులకు నచ్చజెప్పి దీక్షలను విరమింపజేశారు. కార్యక్రమంలో మంత్రి భిక్షపతి, కర్రె చంద్రశేఖర్, మెటి శేఖర్, దుద్దురు స్వామి, దేవరపల్లి నరేందర్, భూషోల స్వామి, శిఖ శ్రీను, మల్లేష్, రాజశేఖర్, ఎండీ ఇమామ్, రాజా, కార్తీక్, సందీప్, రాజు, మధు, శ్రీధర్, రమేష్ తదితరులున్నారు.

తల్లి ఆరోగ్యంగా ఉండాలని ట్రాఫిక్ సీఐ పాదయాత్ర



పాదయాత్రగా యాదగిరిగుట్టకు వచ్చిన ట్రాఫిక్ సీఐ కృష్ణ

యాదగిరిగుట్ట: అనారోగ్యానికి గురైన తన తల్లి ఆరోగ్యం మెరుగుపడాలని వేడుకుంటూ యాదగిరిగుట్ట ట్రాఫిక్ సీఐ యలగొండ కృష్ణ నారపల్లి రామాలయం నుంచి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి పాదయాత్ర చేశారు. గురువారం పాదయాత్ర ప్రారంభించిన ఆయన సుమారు 45 కిలోమీటర్లు నడిచి శుక్రవారం యాదగిరిగుట్టకు చేరుకున్నారు. శ్రీస్వామి వారిని దర్శించుకొని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన తల్లి వద్దకు శ్రీస్వామి వారి ప్రసాదాన్ని తీసుకెళ్లారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దయతో తన తల్లి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే ఇంటికి వస్తుందని ఆయన అన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

భూదాన్‌పోచంపల్లి: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి అన్నారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని బీసీ గురుకుల పాఠశాలలో ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు మెమెంటోతో పాటు అబ్దుల్ కలాం మెమోరియల్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్‌కలాం ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. స్కూల్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ జ్యోష్నారావు మాట్లాడుతూ.. మొక్కలను విరివిరిగా నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ భద్ర, ప్రధాన కార్యదర్శి నిఖిల్‌సాయి కోనేటి, ఆర్గనైజర్ మిట్టపల్లి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి, కోశాధికారి రిజ్వాన్ అహ్మద్, సహాయ కార్యదర్శి రాజేశ్‌గౌడ్, హెచ్‌అండ్‌ఆర్ బ్లాక్ ఇండియా కంపెనీ ప్రతినిధి హరీష్, దయానందరావు, రామకృష్ణ, శంకర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగభూషణచారి, అధ్యాపకులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు

వైభవంగా రథోత్సవం

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని శ్రీ మార్కండేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రథోత్సవంతో ముగిసాయి. సీతవారి సేన ఆధ్వర్యంలో రథంపై స్వామివారిని ప్రతిష్ఠించి మహిళల కోలాటాలు, డప్పు వాయిద్యాలతో పుర వీధుల గుండా ఊరేగించారు. ఉదయం రథాంగ హోమం, దిష్టికుంభం నిర్వహించారు. భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, పీఏసీఎస్‌చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, బాత్క లింగస్వామి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సీత వెంకటేశం, సీత శ్రవన్, సీత దామోదర్, గునిగంటి మల్లేశ్, చిల్వేరు బాలనర్సింహ, కర్నాటి అంజమ్మ, రాజేశ్వరీ, భూషన్, సీత నర్సింహ, జల్ది నర్సింహ, దేవాలయ కమిటీ చైర్మన్ సీత సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భారత ఆంజనేయులు, ప్రధానకార్యదర్శి అంకం యాదగిరి, సహాయకార్యదర్శి గుర్రం కృష్ణ, కోశాధికారి ఇంజమూరి యాదగిరి పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం

చెరువులో గాలింపు చర్యలు

బీబీనగర్: తప్పిపోయిన వ్యక్తి బీబీనగర్ మండల కేంద్రంలో గల పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానం రావడంతో శుక్రవారం పోలీసులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. మేడ్చల్ జిల్లా ఫిర్జాదిగూడకు చెందిన చంద్రయ్య (60) బుధవారం ఉదయం ఇంట్లో నుంచి ఆస్పత్రికి వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులతో చెప్పి బీబీనగర్‌కు చేరుకున్నాడు. తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీబీనగర్ చెరువు కట్టపై ఓ వ్యక్తి దుస్తులు, చెప్పులు, బ్యాగ్ గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే చంద్రయ్య తప్పిపోనట్లు ఫిర్యాదు అందడంతో అనుమానంతో పోలీసులు కుటుంబ సభ్యులను పిలిపించి కట్టపై ఉన్న దుస్తులు, చెప్పులు చంద్రయ్యవిగా నిర్ధారించారు. చంద్రయ్య చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేసిన పోలీసులు జాలర్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే మృతదేహం ఇంకా లభ్యం కాలేదు.

బైక్ చోరీ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కోటి బైక్‌ను ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో ఆయన యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రమేష్ వెల్లడించారు.

పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనానికి నిప్పు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని బీసీ కాలనీలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రమేష్ గురువారం రాత్రి విధులు ముగించుకొని వచ్చాడు. బైక్‌ను తన ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌కు నిప్పు అంటించి వెళ్లిపోయారు. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేయగా, బైక్ అప్పటికే పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పట్టణ సీఐ రమేష్ తెలిపారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై పోలీసులు దాడులు చేశారు. గ్రామంలోని ఓ కిరాణ షాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్న మొగిలిపాక హరినాథ్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈమేరకు అతడిపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయనున్నట్లు ఎస్సై కృష్ణ తెలిపారు.

పర్సు అప్పగింత

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుడు పోగొట్టుకున్న పర్సును ఎస్‌పీఎఫ్ పోలీసులు తిరిగి అతడికి అప్పగించారు. హైదరాబాద్‌లోని ఫిర్జాదిగూడకు చెందిన రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చాడు. దర్శనం క్యూలైన్‌లో వెళ్లే సమయంలో అతడి పర్సు కింద పడిపోయింది. గుర్తించిన ఎస్‌పీఎఫ్, ఆలయ సిబ్బంది అందులోని వివరాల ఆధారంగా మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేయించారు. దీంతో తూర్పు ద్వారం వద్దకు రాజశేఖర్‌రెడ్డి రావడంతో ఎస్‌పీఎఫ్ ఏఎస్సై రాజు వివరాలు తెలుసుకుని పర్సును అప్పగించారు. అందులో రూ.5వేల నగదు ఉన్నట్లు తెలిపాడు.

వివాహిత అదృశ్యం

చౌటుప్పల్ రూరల్: మండలంలోని పీపల్‌పహాడ్ గ్రామంలో వివాహిత అదృశ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామంలో దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం భర్త పని నిమిత్తం బయటకు వెళ్లగా.. కుమారులు పాఠశాలకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి భార్య కనిపించలేదు. ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

మంకీ గన్ వాడకంపై అవగాహన

రాజాపేట: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు రాజాపేట మండల కేంద్రంలో శుక్రవారం రైతులకు మంకీ గన్ వాడకం, వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఉన్న కోతుల బెడద నివారణకు మంకీ గన్ ఎలా వినియోగించాలో వివరించారు. వరిలో తెగుళ్ల బెడద, క్రిమికీటకాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు స్ఫూర్తి, ప్రవంతి, నిశిత, సజ్రానా పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



వేదికను ప్రారంభిస్తున్న ఎంఈఓ, దాతలు

బొమ్మలరామారం: ప్రభుత్వ విద్య బలోపేతానికి దాతల సహకారం అభినందనీయమని ఎంఈఓ రోజారాణి అన్నారు. బొమ్మలరామారం మండలంలోని తిమ్మాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో దాత మూగల రఘునందన్ రెడ్డి సహకారంతో రూ.3 లక్షలతో నిర్మించిన వేదికను శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్టడీ, ఎగ్జామ్, స్పోర్ట్స్ మెటీరియల్, వృద్ధులకు దుస్తుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మూగల రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి ప్రతాప్ రెడ్డి ఆశయాల మేరకు సామాజిక సేవ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తునికి మహేష్, నాశమైన వెంకటేష్, దండు యాదగిరి, కాశమైన కనకరాజు, వెంకటేష్ గౌడ్, ఉపాధ్యాయులు పల్నాటి కృష్ణారెడ్డి, ప్రసాద్, శ్రీశైలం, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

భువనగిరి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా ఈ నెల 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ కోరారు. ఈమేరకు శుక్రవారం భువనగిరి మండలంలోని అనాజీపురం గ్రామంలో మహాధర్నా వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ పేదల జీవితాలకు శాపంగా మారిందని ఆరోపించారు. ఉపాధి, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల అంజయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గునుగుంట్ల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బొల్లేపల్లి కుమార్, అబ్దుల్లాపురం వెంకటేశం, ఏదునూరి మల్లేశం, వెంకటేష్, మైలారం శివ, కృష్ణ, నరసింహ పాండు, రాజు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఆత్మకూరు(ఎం): కేంద్ర బడ్జెట్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.2లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు తుమ్మలగూడెం యాదయ్య అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలంలోని కూరెల్లలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీకి నిధులు తగ్గించి, పథకాన్ని ఎత్తివేయాలని చూస్తోందని ఆరోపించారు. సమావేశంలో పున్నం అండాలు, కప్పల లక్ష్మి, నర్సమ్మ, రాజమ్మ నాగమణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎంవీఎస్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులు చేస్తున్నందున కొత్త గుండ్లపల్లి, పాత గుండ్లపల్లి, బీసీ కాలనీ, నల్ల పోచమ్మవాడకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి కనకదుర్గమ్మ దేవాలయ వార్షికోత్సవాలు

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని కనకదుర్గమ్మ దేవాలయ ప్రథమ వార్షికోత్సవాలను శనివారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు ఏనుగు సురేందర్ రెడ్డి, సుగంధిని తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానికంగా కరపత్రం విడుదల చేశారు. శనివారం గణపతి పూజ, అంకురార్పణ, 9న మహా కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, 10న చండీ హోమం, అన్న ప్రసాద వితరణ, 11న అమ్మ వారికి బండ్లు, బోనాలు సమర్పణ ఉంటుందని తెలిపారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ అధికారులు, ధర్మకర్తలు

బీబీనగర్: మండలంలోని మహదేవ్‌పురం గ్రామంలో గల ఎండోమెంట్ పరిధిలోని శ్రీవేణుగోపాల స్వామి, ఉమామహేశ్వర స్వామి ఆలయాల బ్రహ్మోత్సవాలు ఈనెల 25నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాల ప్రచార పోస్టర్లను శుక్రవారం ఆలయ ఈఓ రుద్రం వెంకటేష్, ఆలయ చైర్మన్ కవాడపు శివారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు దండెం ప్రభాకర్, రవణమ్మ, జస్వంత్ సింగ్, రవిందర్, నగేష్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు దక్కే గౌరవం మరెవ్వరికీ దక్కదు



సురేందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

చౌటుప్పల్: సమాజంలో ఉపాధ్యాయులకు దక్కే గౌరవం మరే ప్రభుత్వ ఉద్యోగికి కూడా దక్కదని మండల విద్యాధికారి గురువారావు అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బీసీకాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాదూరి సురేందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎన్ఓ నర్సింగ్‌రావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శివకుమార్, ఎల్లంబావి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాజాపేట: కుట్టు శిక్షణాకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆరుట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఆరుట్ల సుశీలాదేవి కోరారు. రాజాపేట మండలంలోని బేగంపేట గ్రామంలో సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆరుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొల్లూరి రాజయ్య, వెంకటేశం, లింగం పాల్గొన్నారు.



బేగంపేటలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆరుట్ల ఫౌండేషన్ నిర్వాహకులు


కాంగ్రెస్ నాయకుల నిరసన

భువనగిరిటౌన్: అమెరికాలోని భారతీయ అక్రమ వలసదారులకు బేడీలు వేసి స్వదేశానికి తరలించిన ఘటనపై ప్రధాని మోదీ వ్యవహార శైలిని ఖండిస్తూ భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం స్థానికంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల బాలరాజు, మాజీ కౌన్సిలర్ ఈరపాక నరసింహ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎనగండ్ల సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిరికొండ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు మచ్చ నరసింహ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుమ్మడెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

బీబీనగర్: మండలంలోని పడమటిసోమారంలో ఎండోమెంట్ పరిధిలోని శ్రీలింగబస్వేశ్వర స్వామి ఆలయ హుండీలను శుక్రవారం లెక్కించారు. రూ.8,71,424 ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నరేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బస్వయ్య, ధర్మకర్తలు బలరాం, వెంకటేష్, గోపాల్ రెడ్డి, సుజాత, శ్రీశైలం, భాస్కర్ పాల్గొన్నారు.

డప్పుల బహూకరణ



డప్పులు బహూకరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

రామన్నపేట: మండలంలోని పల్లివాడ గ్రామానికి చెందిన మార్కెట్ వైస్ చైర్మన్ కమ్మంపాటి శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం పల్లివాడ ఎమ్మార్పీఎస్ శ్రేణులకు పది డప్పులను, బీఆర్‌ఎస్ ఎస్సీసెల్ మండల ప్రధాన కార్యదర్శి కళ్లెం స్వామి మూడు డప్పులను బహూకరించారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించారు.

అన్ని స్థానాల్లో సీపీఐ పోటీ

ఆత్మకూరు(ఎం): రానున్న సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో ఆత్మకూరు(ఎం) మండలంలో అన్ని స్థానాల్లో సీపీఐ పోటీ చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశికంటి లక్ష్మీనర్సయ్య శుక్రవారం తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏకపక్ష నిర్ణయాలతో వ్యవహరిస్తుండటంతో ఆ పార్టీతో పొత్తు లేకుండా సీపీఐ అన్ని స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తుందని తెలిపారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన

ఆలేరురూరల్: యాసంగి వరిలో కాండం తొలిచే పురుగు ఉధృతిని గమనించడానికి దీపపు ఎర, లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని ఆలేరు వ్యవసాయ ఏడీఏ పద్మావతి, ఏఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆలేరు మండలం పటేల్‌గూడెం గ్రామంలో వరి పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

ఆలయ వార్షికోత్సవం

మోత్కూరు: మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాపురం గ్రామంలో శుక్రవారం శ్రీప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన జరిపించి, ఆంజనేయ స్వామిని పంచామృతాలతో అభిషేకించారు.